సంపుటి :02 సంచిక :191 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 23, సెప్టెంబర్ 2025

## వేణుగోపాల్ ఆయుధాలు అప్పగించాలి

- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ హెచ్చరిక
- లేదంటే పీజీఏ స్వాధీనం చేసుకుంటుందని స్పష్టీకరణ

04





## జాతీయ పురస్కారం అందుకున్న శ్యాం

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వేదికగా మంగళ వారం 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానం జరిగింది. రాష్ట్రప్రతి ద్రౌపది ముర్మ చేతుల మీదుగా పురస్కారాలకు ఎంపికైన దర్శకులు, నటులు, ఇతర టెక్నీషియన్లు అవార్డులు అందుకున్నారు. దీనిలో భాగంగా బలగం చ్రితానికి పాటలు రాసిన టాలీవుడ్ గేయ రచయిత కాసర్ల శ్యాం జాతీయ ఉత్తమ గేయ రచయితగా పురస్కారం అందుకున్నారు. శ్యాం స్వస్థలం వరంగల్‌లోని బ్రాహ్మణ వీది. శ్యాం అవార్డు అందుకున్న సందర్భంగా స్థానికంగా ఆయనకు అభినందనలు వెల్లువెత్తతున్నాయి.

– అక్షరదర్బార్, ఢిల్లీ

03



## అబార్షన్లు చేస్తే హాస్పిటల్స్ సీజ్ చేస్తాం..!!

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. మధుసూదన్ హెచ్చరిక
- 'అక్షరదర్బార్' కథనానికి స్పందన
- కాటారంలోని ప్రైవేటు హాస్పిటల్స్ ఆకస్మిక తనిఖీ
- పలు ఆసుపత్రులకు నోటీసులు

అక్షర దర్బార్ ఎఫెక్ట్

02

## రూ.5 కే రెండు టీ షర్టులు

ఎగబడ్డ జనం

04





## వహ్వా.. అనేలా మేడారం మహా జాతర

- ఎన్నికోట్లయినా ఖర్చు చేస్తాం
- పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క - సారలమ్మ
- శాశ్వత ప్రతిపాదికన ఆలయ అభివృద్ధి పనులు
- కేంద్రం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి
- జాతర నిర్వహణకు భారీగా నిధులు విడుదల చేయాలి..
- మేడారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ముందుగా ఆలయంలో మొక్కులు చెల్లించుకున్న సీఎం

### ఖర్చు విషయంలో వెనుకాడం

దక్షిణ భారత కుంభమేళాగా పేరుగాంచిన మేడారం మహాజాతరను యావత్ దేశ ప్రజలు మెచ్చుకునేలా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్ని కోట్ల రూపాయలైనా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆలయాన్ని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంగళవారం మంత్రులు, అధికారులతో కలిసి మేడారంలో పర్యటించిన సీఎం, సమ్మక్కసారలమ్మ గద్దెల వద్దకు చేరుకుని 68 కిలోల బెల్లాన్ని అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన సీఎం, జాతరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించి భారీగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత పాకుల నిర్లక్ష్యాన్ని ఆరోపిస్తూ, తమ ప్రభుత్వం ఆదివాసుల అభ్యున్నతికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

– అక్షర దర్బార్, మేడారం

02



## ప్రశాంతంగా నవరాత్రులు జరుపుకుందాం

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

04

# అబార్షన్లు చేస్తే హాస్పిటల్స్ సీజ్ చేస్తాం!

- డీఎంహెచ్ఓ డా.మధుసూదన్ హెచ్చరిక
- 'అక్షరదర్బార్' కథనానికి స్పందన
- కాటారంలోని ప్రైవేటు హాస్పిటల్స్ ఆకస్మిక తనిఖీ
- పలు ఆసుపత్రులకు నోటీసులు


కాటారంలో సీక్రెట్
అబార్షన్ల దందా..!

అక్షరదర్బార్, కాటారం: అక్షరదర్బార్ కథనానికి స్పందన లభించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రంలోని ప్రైవేట్ హాస్పిటల్స్ లో సీక్రెట్ అబార్షన్ల దందా శీర్షికతో తాజాగా అక్షరదర్బార్ కథనం వెలువడగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అలెర్ట్ అయ్యింది. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూధన్ నేతృత్వంలో కాటారంలోని ప్రైవేట్ హాస్పిటల్స్ పై ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆయా ప్రైవేట్ ఆసుపత్రులకు నేరుగా వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రులకు సంబంధించిన రిజిస్ట్రేషన్, తదితర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి రిజిస్ట్రేషన్ లేని ఆసుపత్రులకు నోటీసులు ఇచ్చారు.

### - అబార్షన్లు చేస్తే హాస్పిటల్స్ సీజ్ చేస్తాం

కాటారంలో అబార్షన్లు చేస్తున్నారన్న కథనంపై డీఎంఅండ్ హెచ్వో డా మధుసూదన్ తనదైన రీతిలో సీరియస్ అయ్యారు. అబార్షన్లు చేసినట్లు సమాచారం వచ్చిన, కథనాలు వెలువడిన సదరు హాస్పిటల్స్ ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.



అలాగే ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, హాస్పిటల్స్ పెట్టుకుని క్రిటికల్ ట్రీట్మెంట్స్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా హాస్పిటల్స్ లో గైనకాలజిస్ట్ డాక్టర్ లేకుండానే గర్భవిచ్చితి మాత్రలు ఇస్తున్నారని తెలిసిందని, అలా చేస్తే హాస్పిటల్స్ ని రద్దు చేస్తామన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు కూడా చేయొద్దని, చట్ట రీత్యా క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్వో శ్రీదేవి, కాటారం మెడికల్ ఆఫీసర్ మౌనిక, సందీప్ లు ఉన్నారు.





# వాహ్.. అనేలా మేడారం మహా జాతర

- ఖర్చు విషయంలో వెనుకాడం
- ఎన్నికోట్లయినా ఖర్చు చేస్తాం
- పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క - సారలమ్మ
- శాశ్వత ప్రతిపాదికన ఆలయ అభివృద్ధి పనులు
- జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి
- జాతర నిర్వహణకు భారీగా నిధులు విడుదల చేయాలి..
- మేడారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ముందుగా ఆలయంలో మొక్కులు చెల్లించుకున్న సీఎం

**అక్షరదర్బార్, మేడారం :**

దక్షిణ భారత కుంభమేళాగా పేరుగాంచిన మేడారం మహాజాతరను యావత్ దేశ ప్రజలు మెచ్చుకునేలా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా సమ్మక్క– సారలమ్మ గద్దెల వద్దకు చేరుకుని నెలువెత్తు బంగారాన్ని (68 కిలోల బెల్లం) అమ్మవార్లకు సమర్పించారు. తర్వాత జాతరకు సంబంధించిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. సమ్మక్క సారలమ్మ గద్దెల విస్తరణ, పునర్నిర్మాణంపై పూజారులు, ఆదివాసి సంఘాలతో మాట్లాడారు. గద్దెల విస్తరణ డిజైన్లను ఆవిష్కరించారు. ఇక్కడి పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. మేడారం కేవలం ఒక ఆధ్యాత్మిక క్షేత్రం మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల భావోద్వేగమని పేర్కొన్నారు. పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మ అని కొనియాడారు. సమ్మక్క–సారలమ్మ ఆశీస్సులతో తాను 2023 ఫిబ్రవరి 6న ఇక్కడి నుంచే పాదయాత్ర మొదలు పెట్టానని గుర్తుచేసుకున్నారు. గత పాలకులు సమ్మక్క సారక్క ఆలయ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. కానీ, తమ ప్రభుత్వం ఆలయ అభివృద్ధి విషయంలో ఏమాత్రం వెనుకాడబోదని స్పష్టం చేశారు. ఎన్ని రూ.కోట్లయినా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. ఆదివాసులు, పూజారులు, సంప్రదాయ కుటుంబాలను జాతరలో భాగస్వాములను చేస్తున్నామని వివరించారు. సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. ఆలయాన్ని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. యంత్రాంగం 100 రోజుల్లో పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. సిమెంట్ తో గాకుండా రాతి కట్టడాల తోనే నిర్మాణాలు ఉండేలా డిజైన్లు రూపొందించామని వివరించారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనేలా నిర్మాణాల రూపకల్పన చేశామని చెప్పారు. జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

### - మేడారం జాతరకు కేంద్ర నిధులివ్వాలి..

ఉత్తరాదిలో జరిగే కుంభమేళాకు రూ.వేల కోట్లు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం దక్షిణాదిలో ఆదివాసులు జరపుకొనే 'మేడారం జాతర'కు మాత్రం ఎందుకు నిధులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. మేడారం జాతరకు జాతీయ హోదా గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తగిన విధంగా నిధులు సైతం విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులని, వారి అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఆదివాసీలకు సొంత గూడు కట్టించాలన్న ఉద్దేశంతో ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని గుర్తుచేశారు. ఏ సంక్షేమ కార్యక్రమం చేపట్టినా ఆదివాసీ, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు వేస్తున్నామని వివరించారు. మేడారం మహా జాతర నాటికి భక్తులకు అసౌకర్యం కలగకుండా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పగలూ రాత్రి నిర్విరామంగా పనులు చేస్తేనే ఇది సాధ్యమవుతుందని వివరించారు. సమ్మక్క సారక్క మాలధారణ చేసినట్లుగా యంత్రాంగం, సిబ్బంది పనులను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ సమ్మక్క–సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలున్న ప్రాంగణాన్ని లక్షలాది భక్తులు మంది దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గద్దెల వద్దకు భక్తులు సులువుగా చేరుకునేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. నిర్మాణ విషయంలో ప్రభుత్వం స్థపతి, చరిత్రకారుడు ఈమని శివనాగిరెడ్డి సేవలను వినియోగించుకుంటున్నదని వివరించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.







# తండాల అభివృద్ధికి కృషి

- రూ.700 కోట్లతో రోడ్లు, మౌలిక సదుపాయాలు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

అక్షర దర్బార్, భూపాలపల్లి : రాష్ట్రంలో ఉన్న లంబాడి తండాలు, గిరిజన గూడేల అభివృద్ధికి కృషి చేస్తానని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రూ.700 కోట్ల నిధులను కేటాయించినట్లు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల, వృద్ధుల సంక్షేమ మరియు ట్రాన్స్ జెండర్ల సాధికారత శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గం భూపాలపల్లి మండలం దూదేకులపల్లి, గొల్లబుద్ధారం గ్రామాల్లో బీటీ రోడ్ల అభివృద్ధి పనుల శంకుస్థాపనల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివిధ శాఖల అధికారులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం గొల్లబుద్ధారం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని గిరిజన గూడేలు, లంబాడి తండాల్లో ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, కరెంటు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి రూ.700 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరి చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు. మంత్రి హోదాలో భూపాలపల్లి నియోజకవర్గంలో శంకుస్థాపన కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు.

### నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి..

**: భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర**

భూపాలపల్లి నియోజకవర్గానికి మరిన్ని నిధులు ఇచ్చి అభివృద్ధికి సహకరించాలని నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు వచ్చిన మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. ఈ మేరకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనుల ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రాన్ని సభా వేదికపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అందజేశారు. ప్రజల ప్రతి అవసరాన్ని తీర్చడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందించేలా చూస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రజా ప్రభుత్వం గ్రామాలను మరింతగా అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే చెప్పారు.

# పిడుగుపాటుతో యువకుడు మృతి

అక్షరదర్బార్, దుగ్గొండి: పిడుగుపాటుకు గురై యువకుడు మృతి చెందిన ఘటన దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మొద్దు రాఘవులు కుమారుడు మొద్దు రాకేష్ సోమవారం కురుస్తున్న జోరు వర్షంలో బయటికి రాగా అకస్మాత్తుగా పడిన పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రాకేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది..

పిడుగుపాటుకు గురై మృతి చెందిన రాకేష్ కుటుంబాన్ని మంగళవారం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. కాగా రాకేష్ కుటుంబాన్ని వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పరామర్శించి ఓదార్చారు.



# కాసర్ల శ్యాంకు జాతీయ పురస్కారం



అక్షరదర్బార్, ఢిల్లీ: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వేదికగా మంగళవారం 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానం జరిగింది. రాష్ట్రప్రతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలకు ఎంపికైన దర్శకులు, నటులు, ఇతర టెక్నీషియన్లు అవార్డులు అందుకున్నారు. దీనిలో భాగంగా బలగం చిత్రానికి పాటలు రాసిన టాలీవుడ్ గేయ రచయిత కాసర్ల శ్యాం జాతీయ ఉత్తమ గేయ రచయితగా పురస్కారం అందుకున్నారు. శ్యాం స్వస్థలం వరంగల్‌లోని బ్రాహ్మణ వీధి. శ్యాం అవార్డు అందుకున్న సందర్భంగా స్థానికంగా ఆయనకు అభినందనలు వెల్లువెత్తతున్నాయి.



# వరి ధాన్యం బోనస్ బోగస్

- డబ్బులు రైతుల ఖాతాలో వేయకపోవడం సిగ్గుచేటు
- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్



అక్షర దర్బార్, వరంగల్ : రైతాంగం గత యాసంగిలో ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ.500 బోనస్ నేటికీ రైతుల ఎకౌంట్లో జమ చేయకపోవడం అన్యాయమని తక్షణమే జమ చేయాలని అలాగే గత ఎన్నికల హామీ ప్రకారం కౌలు రైతులను గుర్తించి ప్రభుత్వ పథకాలను వర్తింపచేయాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం అఖిలభారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) వరంగల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షతన వరంగల్ లోని ఓంకార్ భవన్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పెద్దారపు రమేష్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో 22 లక్షల మంది కౌలు రైతులు వ్యవసాయాన్ని నమ్ముకొని భూమి కౌలుకు తీసుకొని అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పంటలు తీస్తున్నారని తెలిపారు.ఈ క్రమంలో పండిన పంట సరైన ధర రాక తెచ్చిన అప్పులు తీరక తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ ఆత్మహత్యలు సైతం చేసుకుంటున్నారని అన్నారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను గుర్తించి ఆదుకుంటామని గత ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నేటికీ అమలు కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీ మూడు నెలలు దాటినా డబ్బులు జమ చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం రైతాంగం సరిపడా యూరియా దొరకక తీవ్ర మనోవేదనకు గురవుతున్న సరైన విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఈనెల 25న కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐకె ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబా బాబురావు కోశాధికారి సింగతి మల్లికార్జున్ జిల్లా సహాయ కార్యదర్శి గోనే రామచందర్ జిల్లా నాయకులు బుడిమే సురేందర్ పేరబోయిన ఐలోని గాజుల వెంకటయ్య జనార్ధన్ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

అక్షర దర్బార్, టేకుమట్ల: మండలంలో నేరాల నియంత్రణ, నేరాల నిర్ధారణ సులభతరం చేయడం కోసం సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో రామకృష్ణాపూర్(వి) గ్రామంలో ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత వివరించగా యువత నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ ముందుకు వచ్చి సహకరించడానికి సిద్ధమయ్యారు.అదే విధంగా ఆసిరెడ్డిపల్లి గ్రామంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను ఈరోజు ప్రారంభించారు. ద్వారకపేటలో ఏర్పాటు చేసిన నాలుగు కెమెరాల పనితీరును ఎస్సై పరిశీలించారు.ప్రతి గ్రామంలోనూ ప్రజలు స్వయంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటులో భాగస్వామ్యం కావాలని, తద్వారా గ్రామ భద్రత బలోపేతం అవుతుందని, నేరాలు తగ్గి, విచారణ మరింత సులభమవుతుందని ఎస్సై పిలుపునిచ్చారు.

# సామాన్యుడి అభ్యున్నతే నరేంద్ర మోడీ లక్ష్యం

**: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**

అక్షర దర్బార్, నర్సంపేట: సామాన్య ప్రజల ఆర్థికాభివృద్ధి ద్వారానే దేశ ప్రగతి సాధ్యమని, పేదల అభ్యున్నతికే ప్రధాని నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్తూపం చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం పేదలు, రైతులు, విద్యార్థులు, మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేసే విధంగా జీఎస్టీ లో భారీ తగ్గింపులు చేసినట్లు తెలిపారు. 28% నుంచి 18%, 18% నుంచి 5%, 12% నుంచి 5%, 18% నుంచి 0% వరకు పన్ను తగ్గింపులు జరగడం దసరా పండుగకు ప్రజలకు నిజమైన కానుకగా మారిందన్నారు. వ్యవసాయ యంత్రాలపై పన్ను తగ్గడంతో రైతుల ఖర్చులు తగ్గి ఆదాయం పెరగనుందని, దినసరి అవసరాల వస్తువులు, గృహ వినియోగ వస్తువుల ధరలు తగ్గడం వల్ల జీవన వ్యయం గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. రైతు ఖర్చులు తగ్గి ఉత్పత్తి పెరిగేలా మోడీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షుడు అంబేద్కర్, జిల్లా నాయకులు వడ్డేపల్లి నరసింహారాములు, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కు సన్మానం

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తుడుం వెంకటేష్ ఆధ్వర్యంలో నూతన తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం దళిత గిరిజన బహుజన వర్గాలకు భూ సమస్యలు భూభారతి ద్వారా సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు అరికెళ్ల దేవయ్య, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముఖేష్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు మామిడి భాస్కర్, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి మారపల్లి చిరంజీవి, మారపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ కమిటీ వైస్ చైర్మన్ గా డా.మడికొండ శ్రీను



అక్షర దర్బార్, పరకాల: టీపీసీసీ ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ కమిటీలో వైస్ ఛైర్మన్ గా నియామకం అయినా పరకాల పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మడికొండ శ్రీను. స్థానిక శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యుత్ షాక్ తో కేబుల్ ఆపరేటర్ మృతి



అక్షర దర్బార్, టేకుమట్ల: విద్యుత్ స్థంభానికి ఉన్న డిష్ వైర్లను సరిచేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కి గురై కిందపడి తల పగిలి డిష్ కేబుల్ ఆపరేటర్ సాదా ఓదెలు (50) మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఎస్సై దాసరి సుధాకర్ కథనం ప్రకారం.. టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన సాదా ఓదెలు మంగళవారం ఉదయం విద్యుత్ స్థంభానికి ఉన్న డిష్ వైర్లను నిచ్చెన సాయంతో ఎక్కి సరిచేస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలి షాక్ కి గురై కింద ఉన్న సీసీ రోడ్డుపై పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న టేకుమట్ల ఎస్సై సుధాకర్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చిట్యాల సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.




# అన్నపూర్ణ దేవి అవతారంలో అమ్మవారు

## అన్నదానం చేసిన దీప్తి రాకేష్ రావు దంపతులు.

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని కనకదుర్గమ్మ,మదన పోచమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 2 వ రోజు అన్నపూర్ణ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు మణిదీప్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం కొక్కిరాల దీప్తి-రాకేష్ రావు దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, నాగెల్లి రంజిత్, ఇంగిలి వీరేష్ రావు, మూసినిపల్లి శివ ప్రసాద్, పచ్చిక శంతన్ రెడ్డి, నిఖిల్ పాల్గొన్నారు.



# క్యాన్సర్ బాధితుడికి ఆర్ధిక సాయం అందజేత

అక్షర దర్బార్, కాటారం: కాటారం మండలంలోని చింతకాని గ్రామానికి చెందిన ఆత్కూరి మొగిలి గత కొంత కాలం నుండి గొంతు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకోసం జయశంకర్ ఫౌండేషన్ వారిని ఆశ్రయించడంతో వెంటనే స్పందించిన అయిలి మారుతి వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకుని నీకేం కాదని మనోధైర్యం కల్పించి వైద్యానికి ఆర్థిక సహాయం అందజేశారు.



# గాయత్రీ దేవి అవతారంలో దుర్గామాత

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మంజూరునగర్ నందు వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు దుర్గామాత అమ్మవారు శ్రీ గాయత్రీతత అమ్మవారి అవతారమెత్తి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, అర్చన మరియు చండీ పారాయణం కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే,ఆలయ ధర్మకర్తలు గండ్ర వెంకట రమణా రెడ్డి జ్యోతి గార్లు కుటుంబ సమ్మేతంగా ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

అక్షర దర్బార్, దుగ్గొండి: అక్రమంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు దుగ్గొండి ఎస్సై రావుల రణధీర్ రెడ్డి తెలిపారు. మండలంలోని రేఖాంపల్లి గ్రామానికి చెందిన రమేష్, రాజు, ప్రవీణ్, మరో రాజు, స్వామి, రాజయ్య, మురళిలు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని దురాశతో గ్రామంలోని ఓ ఇంటి బయట ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో వారిని పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.17,580 నగదు, ఒక బైక్, ఆరు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

# రూ.5 కే రెండు టీ షర్టులు

## - మహబూబాబాద్ లో ఎగబడ్డ జనం

అక్షరదర్బార్, మహబూబాబాద్: వరుసగా పండగలను పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఓ రెడీ మెడ్ దుస్తుల షాపు యజమాని చిన్నపిల్లలకు కేవలం 5 రూపాయలకే 2 టీ షర్టులు ఇస్తామని ఆఫర్ ప్రకటించాడు. దీంతో మంగళవారం ఒక్కసారిగా జనం షాపు వద్ద ఆఫర్ టీ షర్టుల కోసం ఎగబడ్డారు. కొందరు మహిళలు అయితే ఏకంగా చిన్నపిల్లల్ని వెంట పెట్టుకొని మరీ



వచ్చి క్యూ లైన్ లో నిలబడ్డారు. మంగళవారం షాప్ కొత్తగా ప్రారంభిస్తున్న సందర్భంగా ఐదు రూపాయలకు రెండు టీ షర్టుల ఆఫర్ పెట్టామని, అలాగే 9 నుంచి 99 రూపాయల వరకు చిన్నపిల్లలకు అవసరమైన రెడీమేడ్ దుస్తులు లభిస్తాయని హోర్డింగ్ పెట్టారు.







# డా. సిరంగి సౌందరయ్యకు ఘన నివాళి

- నియోజకవర్గ వ్యాప్తంగా 24వ వర్ధంతి కార్యక్రమాలు
- అన్ని మండలాల్లో అన్నదానాలు
- మహానేత సేవలను స్మరించుకున్న బీజేపీ నాయకులు

అక్షర దర్బార్, పరకాల: హిందుత్వ విలువల కోసం తన జీవితాన్ని అర్పించిన జాతీయవాది, అమరుడు డాక్టర్ సిరంగి సౌందరయ్య 24వ వర్ధంతి సందర్భంగా పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ఘన నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో పరకాల, దామెర, నడికూడ, ఆత్మకూరు, గీసుకొండ, సంగెం మండలాల్లో ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ సౌందరయ్య జ్ఞాపకార్థంగా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, ఆయన త్యాగాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల అధ్యక్షులు మాట్లాడుతూ.. "మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన సౌందరయ్య బీజేపీ పటిష్టత కోసం జీవితాంతం శ్రమించారు. ఆయన ఆశయాలు ఈరోజు కూడా బీజేపీ కార్యకర్తలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి" అని పేర్కొన్నారు. నక్సలైట్ గుండాల చేతిలో ప్రాణాలు కోల్పోయిన సౌందరయ్యను "జాతీవాద అమరుడిగా" కొనియాడుతూ, పార్టీ తరఫున ఆయన త్యాగాలను ఎన్నటికీ మరిచిపోలేమని నేతలు తెలిపారు. పార్టీ శ్రేణులు ఆయన ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్షుడు కాసగాని రాజ్ కుమార్, దామర మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్, నడికుడ మండల అధ్యక్షుడు ఎరుకల దివాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరామ్ రెడ్డి, తదితర మండల అధ్యక్షులతో పాటు బిజెపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## పరకాలలో ఘన నివాళి

పరకాల పట్టణంలో దివంగత బీజేపీ నేత డా. సిరంగి సౌందరయ్య 24వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో సౌందరయ్య చిత్రపటానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సౌందరయ్య కుమారుడు డా. సిరంగి సంతోష్ కుమార్ పూలమాలలు వేసి స్మరించారు. కార్యక్రమంలో చిన్న జంగారెడ్డి, కాచం గురు ప్రసాద్, దేవునూరి మేఘనాథ్, ఆర్. పి. జయంత్ లాల్, సిరంగి సతీష్, సంఘ పురుషోత్తం, కుక్కల విజయ్, పిట్ట వీరస్వామి, ఎర్ర రామన్న, మార్త భిక్షపతి పాల్గొన్నారు.

# జాగ్రత్తగా నవరాత్రులు జరుపుకుందాం

## * వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




అక్షరదర్బార్, హనుమకొండ: దేవి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. మహిళలు బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో, దుర్గామాత అమ్మవారు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో పోలీస్ శాఖ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, పెట్రోలింగ్, విజబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, వేడుకలు జరిగే అన్ని ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు పోలీసు యంత్రాంగం గట్టి భద్రతా ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఉత్సవాలు సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అగ్ని ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అన్ని దుర్గామాత విగ్రహాలను జియో ట్యాగ్ చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా మహిళలు తమ ఇళ్ల ముందు బతుకమ్మ ఆడతారు కాబట్టి బహిరంగ ప్రదేశాల్లో అవసరమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లను చేయాలని సీపీ ఆదేశించారు.

# వేణుగోపాల్ ఆయుధాలు అప్పగించాలి

- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ హెచ్చరిక
- లేదంటే పీజీఏ స్వాధీనం చేసుకుంటుందని స్పష్టీకరణ

అక్షరదర్బార్, హైదరాబాద్: సీనియర్ మావోయిస్టు నేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతిపై మావోయిస్టు కేంద్ర కమిటీ తీవ్ర చర్యలు తీసుకుంది. ఇటీవల ఆయన చేసిన ప్రకటనలను ఖండిస్తూ, ఆయన్ను మావోయిస్టు పార్టీ ద్రోహిగా పేర్కొన్నది. తన వద్ద ఉన్న ఆయుధాలను తక్షణం పార్టీకి అప్పగించాలని ఆదేశించింది. లేనిపక్షంలో, వాటిని పీపుల్స్ గెరిల్లా ఆర్మీ (పీజీఏ) స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించింది. మల్లోజుల వేణుగోపాల్ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధిగా ఇటీవల ఆయన మావోయిస్టు పార్టీ ఆయుధాలు వదులుకోవడానికి సిద్ధంగా ఉందని, కాల్పుల విరమణ, శాంతి చర్చలకు ఆసక్తిగా ఉన్నామని ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనను పార్టీ కేంద్ర కమిటీ పూర్తిగా తప్పుబట్టింది. ఇది పార్టీ విధానానికి విరుద్ధమని, వేణుగోపాల్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేసింది. భూపతి పోలీసులకు లొంగిపోవాలనే ఉద్దేశంతోనే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నది.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915